PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాజేష్

మంచిర్యాల | హైదరాబాద్ | రంగారెడ్డి | epaper.arjun saamaachaaram.com | శనివారం 15, ఆగస్టు 2026 | సంపుటి :1 సంచిక : 216 | పేజీలు : 8 , వెల.2.00










## జనగణన-2027పై కేంద్రం కీలక నోటిఫికేషన్.. తొలిసారిగా సమగ్ర కుల గణన

2 లో..

దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన-2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు.



### తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

# నిర్వహణకు కేబినెట్ నిర్ణయం

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సు
- సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలు
- 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు
- అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు
- వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన
- కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం

2 లో..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి  అధ్యక్షతన ఈరోజు (శుక్రవారం) రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనుంది.ఈ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది.



### రాహుల్ గాంధీకి ఊరట..

## పరువు నష్టం కేసును కొట్టేసిన సుప్రీం

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో తాజాగా ఊరట దక్కింది. సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి నేరపూరిత పరువు నష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం తాజాగా కొట్టేసింది. ఈ కేసులో లఖ్నవూ మెజిస్ట్రేట్ జారీ చేసిన సమన్లను కోర్టు కొట్టేసింది. ఈ కేసుకు సంబంధించిన ముందస్తు అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయలేదని పేర్కొంది.

2

### నాకు, విద్యార్థులకు మధ్య జోక్యం

## చేసుకోవద్దు: చీఫ్ జస్టిస్ సూర్యకాంత్



2

నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థులపై చర్యలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిద్ధమైనందుకు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకూ, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకునేందుకు వారెవరని ప్రశ్నించారు. 2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోవద్దంటూ రాష్ట్ర కౌన్సిల్స్‌ను బీసీఐ ఆదేశించిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్యఅతిథిగా ఆహ్వానించడంపై విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది.



## భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దు..

వార్త 2లో

### స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ

## ఫొటో ఎందుకు పెట్టరు?



2

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు.



### కరూర్ తొక్కిసలాట

## బాధితులకు ప్రభుత్వ జాబ్స్.. హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

## 'సీఎం డైరెక్షన్‌తోనే భూముల నిషేధం'..

### ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్,



తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు.భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

### నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు

## మారుతోంది: డీజీపీ ఆనంద్



నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్   వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఈరోజు (శుక్రవారం) నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.



2

## ఆ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి క్లారిటీ

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు కేబినెట్ నిర్ణయం

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సు
- సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలు
- 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు
- అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు
- వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన
- కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం



హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈరోజు (శుక్రవారం) రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని మంత్రులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

## జనగణన-2027పై కేంద్రం కీలక నోటిఫికేషన్.. తొలిసారిగా సమగ్ర కుల గణన

న్యూఢిల్లీ, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన-2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు.దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన-2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు.రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జనగణనలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ కల్పించారు. సెన్సస్ యాక్ట్, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.

## రాహుల్ గాంధీకి ఊరట.. పరువు నష్టం కేసును కొట్టేసిన సుప్రీం

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో తాజాగా ఊరట దక్కింది. సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి నేరుపూరిత పరువు నష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం తాజాగా కొట్టేసింది. ఈ కేసులో లఖ్నవూ మెజిస్ట్రేట్ జారీ చేసిన సమన్లను కోర్టు కొట్టేసింది. ఈ కేసుకు సంబంధించిన ముందస్తు అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయలేదని పేర్కొంది. భారత్ జోడో యాత్ర సందర్భంగా ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వివాదాస్పదమైన విషయం తెలిసిందే.రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం చెబుతూ నృపేంద్ర పాండే కేసు దాఖలు చేసేందుకు ప్రయత్నించారు. సెక్షన్ 153ఏ కింద కేసు నమోదు కోసం అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. అయితే, ఈ పిటిషన్‌ను ఏసీజేఎమ్ తోసిపుచ్చారు. ఈ తీర్పును పిటిషనర్ సెషన్స్ కోర్టులో సవాలు చేయగా న్యాయస్థానం కేసును మళ్లీ మెజిస్ట్రేట్‌కు బదిలీ చేసింది. ఈ క్రమంలో లఖ్నవూ మెజిస్ట్రేట్ రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేశారు. సమన్లను సవాలు చేస్తూ రాహుల్ గాంధీ హైకోర్టును ఆశ్రయించారు. తమపై క్రిమినల్ చర్యలను కొట్టేయాలని అభ్యర్థించారు. అయితే, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని అలహాబాద్ హైకోర్టు తేల్చి చెప్పింది. సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించింది.ఈ క్రమంలో సుప్రీం కోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీకి తాజాగా ఊరట దక్కింది. సెక్షన్ 153ఏ కింద చర్యలు చేపట్టేందుకు కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాల ముందస్తు అనుమతి లేని కారణంగా రాహుల్‌పై దాఖలైన కేసును కొట్టేస్తున్నట్టు పేర్కొంది. అయితే, స్వాతంత్ర సమరయోధుల గురించి ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో చేయొద్దని కూడా సుప్రీం కోర్టు రాహుల్ గాంధీకి స్పష్టం చేసింది.

## కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ జాబ్స్.. హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజయ్‌కు స్వల్ప ఊరట లభించినట్టైంది. ఈ కేసులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం చేస్తే అభ్యంతరం చెప్పే వారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒకే ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు మీరెవరు? అని ప్రశ్నించింది. గతేడాది టీవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీకే అధినేత విజయ్ మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు.అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాలు వినియోగించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రభుత్వ తప్పిదాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ బాధితులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వని విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ కేసులో కారుణ్య నియామకాలకు అనుమతిస్తే ఒక ప్రమాదకరమైన ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హైకోర్టు అప్పట్లో పేర్కొంది.

## నాకు, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకోవద్దు: చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

ఇంటర్నెట్ డెస్క్:

నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థులపై చర్యలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిద్ధమైనందుకు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకూ, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకునేందుకు వారెవరని ప్రశ్నించారు.2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోవద్దంటూ రాష్ట్ర కౌన్సిల్స్‌ను బీసీఐ ఆదేశించిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్యఅతిథిగా ఆహ్వానించడంపై విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఘటనపై విచారణ జరపాలని కూడా యూనివర్సిటీని కోరింది. ఈ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరకు ఈ అంశం సుప్రీం కోర్టుకు చేరింది.ఈ పరిణామాలపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. బీసీఐ జోక్యం ఎంతమాత్రం అవసరం లేదని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఇది విద్యార్థులకు, తనకు మధ్య ఉన్న అంశమని స్పష్టం చేశారు. బీసీఐకి ఈ అంశంలో ఎలాంటి నిమిత్తం లేదని అన్నారు. విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉందని కూడా స్పష్టం చేశారు. బీసీఐ అనవసరంగా జోక్యం చేసుకుందని కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నామని బీసీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను కోర్టు మరో రెండు వారాల పాటు వాయిదా వేసింది.స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించడంపై అభ్యంతరం చెబుతూ యూనివర్సిటీ అధికారులకు సుమారు 450 మంది లేఖ రాయడంతో వివాదం మొదలైంది. పేపర్ లీక్‌పై ఛలో సంసద్ కార్యక్రమంలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో సుప్రీం కోర్టు తీరును తప్పుబట్టిన విద్యార్థులు ఈ లేఖను రాశారు.

## భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దు..

### ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్ వార్నింగ్

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌పై డిస్కవరీలో త్వరలో ప్రసారం కానున్న డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ఎన్ఎస్ఏ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎన్ఎస్ఏ ఇంటర్వ్యూ ఇవ్వడం ఇదే తొలిసారి. పహల్గాం దాడి తరువాత భారత్ ఆపరేషన్ సిందూర్ చెపట్టిన సమయంలో పరిస్థితులపై అజిత్ డోభాల్ ఈ డాక్యుసిరీస్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు.ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ఏమిటో ముందస్తుగానే నిర్ణయించుకున్నామని అజిత్ డోభాల్ తెలిపారు. పహల్గాం దాడి వెనకున్న ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడమే తమ టార్గెట్ అని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలపై భారత్ దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్‌తో పంపామని చెప్పారు.'ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాము. భారత దేశ సహనాన్ని బలహీనతగా భావించి పొరపాటు చేయొద్దు. భారత్ ఎంతటి రిస్కైనా తీసుకోగలదు. పర్యావసానాలను లెక్క చేయకుండా దాడులు చేయగలదు' అని ఆయన అన్నారు. డోభాల్‌తో పాటు ఈ ఆపరేషన్ వెనకున్న పలువురు అధికారులు తమ అనుభవాలను ఈ డాక్యుమెంటరీలో వెల్లడించారు. శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీలో, డిస్కవరీం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దాడులకు ప్రతీకారంగా భారత్ గతేడాది మే7న ఆపరేషన్ సిందూర్‌ను లాంచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో పలు ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఆ తరువాత 88 గంటల పాటు ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. మే 10న పాక్ ప్రతిపాదించిన కాల్పుల విరమణకు భారత్ అంగీకరించింది.

## స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు?: ఎంపీ రఘునందన్ రావు..

ఢిల్లీ:

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు.రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

## ఆ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి క్లారిటీ

యాదాద్రి, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. ఈరోజు (శుక్రవారం) యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు.

### ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలి..

తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోంది: డీజీపీ ఆనంద్

హైదరాబాద్,

నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఈరోజు (శుక్రవారం) నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

### వారు ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారు..

సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు.

### ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఎక్కువ..

సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

## రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం

### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు ప్రారంభించిన చంద్రబాబు

**అమరావతి,**

అమరావతి రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధానిలో నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. గురువారం నూతన భవన సముదాయాన్ని సీఎం చేతుల మీదుగా సాధారణ పరిపాలన శాఖ జీఏడీకి సీఆర్డీఏ అప్పగించింది. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస భవన సముదాయాన్ని నిర్మించారు. ఒక్కొక్కటి 3,500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ఫ్లాట్లను సీఆర్డీఏ నిర్మించింది. అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించిన సీఆర్డీఏ.. టవర్స్ మధ్య ప్రత్యేక లాన్స్‌ను పెంచింది. అధునాతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫ్లాట్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఇక, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల అప్పగింత అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సాధారణ పరిపాలన శాఖ చూసుకోనుంది. అనంతరం ప్రభుత్వం నిర్ణయించే విధానానికి అనుగుణంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేటాయింపు ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది.

## రాజధానితోనే రాష్ట్రానికి ఆదాయం

### అన్ని జిల్లాలకు మధ్యలో అమరావతి

### పురపాలక శాఖ మంత్రి నారాయణ

**అమరావతి,**

రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని.. ఏపీకి ఆర్థిక రాజధాని కట్టాలని సీఎం చంద్రబాబు భావించారని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను, బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జిను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచే ఎక్కువగా వస్తోందన్నారు. అలాగే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడులకు ముంబాయి, బెంగళూరు, చెన్నైల ద్వారా ఆదాయం వస్తోందని తెలిపారు. ఆర్థిక రాజధాని నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా అందించిందని చెప్పుకొచ్చారు. ఐకానిక్ భవనాల నిర్మాణం కోసం నార్మల్ ఫాస్టర్స్ లండన్ వారిని సంప్రదించినట్లు తెలిపారు. కృష్ణానది ఒడ్డున అమరావతి కడితే అన్ని జిల్లాలకు సమన్యాయం జరుగుతుందని వెల్లడించారు. అమరావతి.. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు మధ్యలో ఉంటుందని మంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గం అందుబాటులో ఉందన్నారు. 2015 జనవరిలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ ఇచ్చామని.. కేవలం 58 రోజుల్లో ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా 34,000 ఎకరాలను రైతులు ఇచ్చారని వివరించారు. అమరావతిలో పనులు ప్రారంభించడం, టెండర్లు పిలవడం, ఇతర పనులు చేపట్టడానికి మూడున్నర సంవత్సరాలు పట్టిందన్నారు. మిగిలిన సంవత్సరం 6 నెలల్లో పదివేల కోట్లు అమరావతి కోసం ఖర్చు చేశామని అన్నారు. గంతలో వైసీపీ అధికారంలోకి వచ్చి మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడిందని మంత్రి విమర్శించారు. అమరావతి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ ఆపేసిందన్నారు. నిర్మాణ సంస్థల ఒప్పందాలను క్లోజ్ చేయకుండా వదిలేసిందని.. దీంతో కూటమి ప్రభుత్వం తిరిగి వచ్చాక ఆయా సంస్థలతో ఒప్పందాలను టెక్నికల్‌గా క్లోజ్ చేసి తిరిగి టెండర్లు పిలవాల్సి వచ్చిందని అన్నారు. గతంలో ఉన్న పనుల నాణ్యతను ఐఐటీ చెన్నై, హైదరాబాద్ వారితో పరీక్షింప చేసి పనులను ప్రారంభించామన్నారు. సీడ్ యాక్సిస్ రోడ్‌ను ఆనుకుని ఎలక్ట్రికల్, గ్యాస్, టెలిఫోన్ వాటర్ వంటివి అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ప్లాన్ చేశామన్నారు. వైసీపీ ఓ గొడ్డలి పార్టీగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేసిందని.. అయినా రైతులు అమరావతి నిర్మాణానికి సహకరించారని తెలిపారు. ఇలాంటి అమరావతి నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

## సీడ్ యాక్సెస్ రహదారిపై దుష్ప్రచారం

### అపోహలకు ఎలాంటి తావు లేదన్న పురపాలక శాఖ

**అమరావతి,**

ఏపీ రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రహదారిలోని ఎస్ ఆకారపు మలుపుపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది. అమరావతిని ఇతర ప్రాంతాలతో కనెక్ట్ చేసే ప్రధాన సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణంపై అపోహలకు తావులేదని స్పష్టం చేసింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని పేర్కొంది. ఈ రహదారి మూడో దశలో విజయవాడ- చెన్నై నేషనల్ హైవే కనెక్టివిటీకి అనుగుణంగా ఈ నిర్మాణం ఉంటుందని చెప్పింది. సీడ్ యాక్సెస్ రహదారిని మణిపాల్ హాస్పిటల్ దగ్గర జాతీయ రహదారితో అనుసంధానం చేసేలా ప్రణాళికలు చేస్తున్నట్లు పురపాలక శాఖ వెల్లడించింది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు అనువుగా ప్రస్తుత సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని తెలిపింది. 2017 ప్రణాళిక ప్రకారమే దొండపాడు నుంచి తాడేపల్లి వరకూ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొంది. రాజధాని అమరావతికి, మంగళగిరి, విజయవాడలతో కనెక్టివిటీ పెంచేలా స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రహదారులు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. సీడ్ యాక్సెస్ రహదారి కనెక్టివిటీ అందుబాటులోకి రావటంతో కృష్ణా కరకట్టపై వాహనాల రద్దీ తగ్గనుందని పేర్కొంది. ఈ వాస్తవాలను గమనించి అపోహలకు గురి కావొద్దని ప్రజలకు పురపాలక శాఖ విజ్ఞప్తి చేసింది.

## చంద్రగిరిలో ఏనుగుల హల్‌చల్

### పంటపొలాలను ధ్వంసం చేసినట్లు రైతుల వెల్లడి

**తిరుపతి,**

జిల్లాలోని చంద్రగిరి మండలం యల్లంపల్లిలో మరోసారి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి గ్రామ పరిసరాల్లోకి సుమారు 15 ఏనుగులు చొరబడి పంట పొలాలపై దాడి చేశాయి. వరి పంటతో పాటు పశువుల కోసం సాగు చేసిన గడ్డి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. రైతులకు చెందిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాత్రివేళ ఏనుగుల గుంపు ఒక్కసారిగా పంట పొలాల్లోకి రావడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడితో నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు మళ్లీ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండటంతో యల్లంపల్లి ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఏనుగులు ఎప్పుడు, ఎటువైపు నుంచి వస్తాయో తెలియక రైతులు రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు. పంట నష్టానికి పరిహారం అందించడంతో పాటు ఏనుగులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో అటవీ అధికారులు రంగంలోకి దిగి ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్నారు. ఏనుగుల గుంపును సురక్షితంగా అటవీ ప్రాంతం వైపు తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## ఆబిడ్స్‌లో మహిళపై దూసుకెళ్లిన కారు

### కారు సినీ నిర్మాత పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్,**

నగరంలోని అబిడ్స్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గన్‌ఫౌండ్రీ ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత.. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సినిమా నిర్మాత డ్రైవర్ మహానంద నడుపుతున్న కారు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో సునీత కాలుకు ఫ్రాక్చర్ కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని.. ఫిల్మ్ ప్రొడ్యూసర్ బొమ్మకు మురళి యజమాని అని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన అనంతరం ఆయనకు ఫోన్ చేసి సునీత చికిత్సకు అయ్యే ఖర్చులను భరించాలని కోరినట్లు చెప్పారు. అయితే డబ్బులు ఇవ్వనని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు వారు వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు.. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి కూడా

### వారే లేకుంటే అమరావతే లేదన్నది సత్యం

### రైతులను భాగస్వాములను చేసేందుకే ల్యాండ్ పూలింగ్

### గ్రాఫిక్స్ అన్నవారికి చెంపపెట్టులా నిర్మాణాలు


### సైబరాబాద్ స్ఫూర్తితో అమరవాతి నిర్మాణానికి అడుగు

### అమరావతి నిర్మాణం రాష్ట్ర భవిష్యత్‌కు ప్రతీక

### స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు

**అమరావతి**

అమరావతి రైతులది త్యాగమే కాదు.. స్ఫూర్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వారు ముందుకు రాకుంటే ఇవాళ రాజధాని నిర్మాణాన్ని ఊహించలేమని అన్నారు. గత ప్రభుత్వం వారిని కేసులతో అనేక ఇబ్బందులకు గురిచేసినా, రాజధాని కోసం త్యాగాలకు వెరవలేదని అన్నారు. రాజధాని అమరావతిని కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ-3ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జీల ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద శిలాఫలకాన్ని చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరైన రైతులు, స్థానికులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఏమవుతుందో తెలియని స్థితిలో అందరం ఉన్నామని, రాజధాని ఎక్కడ నిర్మించాలో అర్థం కాని పరిస్థితి అన్నారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ వేశారు. మెజారిటీ ప్రజలు అమరావతినే సూచించారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించి నిర్మాణానికి సంకల్పించా.. కేవలం ఓ 50 ఎకరాల్లో భవనాలు నిర్మించవచ్చని, అయితే భవిష్యత్ ఏం కావాలన్న ప్రశ్న ఉదయించడంతో అమరావతి నిర్మాణానికి పూనుకున్నామని అన్నారు. అయితే ఇందుకోసం భూములు కావాలి కదా? మహానగరంగా ఎలా చేయాలని ఆలోచిస్తే.. ల్యాండ్‌పూలింగ్ కాన్సెప్ట్ వచ్చింది. రాజధాని నిర్మాణంలో రైతులను భాగస్వాములను చేస్తే బాగుంటుందని ఆలోచించా. ఒక్కమాట చెప్పగానే.. నన్ను నమ్మి భూములిచ్చేందుకు అన్నదాతలు ముందుకొచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన 58 రోజుల్లోనే రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. 33వేల ఎకరాలు ఇచ్చేందుకు.. 29వేల మంది రైతులు ముందుకొచ్చారు. అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని నాటి సంగతులను సీఎం చంద్రబాబు వివరించారు.సింగపూర్ మోడల్‌తో అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తనపై ఉన్న నమ్మకంతో ఆ ప్రభుత్వం ఉచితంగా ప్లాన్ ఇచ్చారని అన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుతో అమరావతికి కనెక్టివిటీ పెరగనుందని పేర్కొన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించా నని తెలిపారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులకు పాదాభివందనం చేస్తున్నానని అన్నారు. రైతులు లేకపోతే రాజధాని లేదని



చెప్పుకొచ్చారు. ఆనాడు అమెరికాలో పర్యటించి.. సైబరాబాద్ రూపకల్పన చేశామని ప్రస్తావించారు. రూపాయి తీసుకోకుండా అమరావతి కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ రూపొందించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఏపీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. అమరావతి రైతుల త్యాగమే కాదని.. స్ఫూర్తి కూడా చాలా గొప్పదని ప్రశంసించారు. నాడు రాజధాని ఎక్కడ కట్టాలనే సందిగ్ధత ఉండేదని తెలిపారు. శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఇందుకోసం ఓ కమిటీ వేశారని ప్రస్తావించారు. రాజధానిగా అమరావతినే మెజార్టీ ప్రజలు కోరుకున్నారని ప్రస్తావించారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతి నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. ఆనాడు సైబరాబాద్‌ను నిర్మించామని చెప్పారు. హైదరాబాద్ ఆదాయం పెరగడానికి తాను చేసిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. ప్రజల నిర్ణయం మేరకే రాజధాని అమరావతిని ఎంపిక చేశామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆనాడు హైటెక్‌సిటీ నిర్మిస్తే కొంతమంది ఎగతాళి చేశారని అన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని వెల్లడించారు. హైటెక్‌సిటీ నిర్మాణం దశలోనూ ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నామని చెప్పారు. విమర్శలు పట్టించుకోకుండా సైబరాబాద్ నిర్మాణంపై దృష్టి పెట్టామని తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్ ఎదుగుదల చూసి గర్వపడుతున్నామని అన్నారు. రాజధాని లేకపోతే మనం ఏమీ చేయలేమని గ్రహించానని చెప్పారు. హైదరాబాద్‌ను మించిన మహానగరాన్ని నిర్మించాలని తాము సంకల్పించామని అన్నారు. సింగపూర్ మోస్ట్‌లివబుల్ కంట్రీ.. అందుకే ఆ మోడల్ తీసుకున్నామని వెల్లడించారు. గ్రాఫిక్స్ అంటూ అమరావతిని వైసీపీ నేతలు ఎగతాళి చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడొచ్చి చూడండి.. అమరావతి ఎలా ఉందో అని ప్రశ్నించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఆనాడు అమరావతిని రాజధానిగా అంగీకరించారని ప్రస్తావించారు. 5,10 కాదు.. 40వేల ఎకరాలు కావాలని జగన్ చెప్పారన్నారు. ఆ తర్వాత రాజధాని పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. జగన్ హయాంలో రాజధాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేది.. అమరావతి ఉద్యమమని తెలిపారు. అమరావతి చరిత్రలో రైతులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అన్నారు. దేవతల రాజధాని అమరావతి.. ఇక్కడ ఇబ్బందులు ఉండవని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి ద్వారా రాజధానికి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నాం. అమరావతిని ఆపడం ఇక ఎవరితరం కాదు. నీటి సమస్యలేని ఏకైక రాజధాని అమరావతి. విద్యుత్ స్తంభాలు, వైర్లు కనిపించని ఆధునిక నగరమిది. గ్యాస్‌తో సహా అన్నీ భూగర్భం నుంచే వెళ్లే రాజధాని మన అమరావతి. ఇవాళ ప్రారంభించిన రోడ్డు చిన్న ట్రైలర్ మాత్రమే. రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్ట మొదటి సక్సెస్. రాష్ట్రాభివృద్ధిలో మొదటి మెట్టు ఎక్కాం. రాజధానితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. హెల్తీ వెల్తీ హ్యాపీ కావాలన్నదే అందరి సంకల్పం కావాలి. అమరావతి నిర్మాణం చేసి చరిత్ర సృష్టిస్తున్నందుకు గర్వంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రలుఉ పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, తాడికొండ శాసనసభ్యుడు తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని టీచర్ మృతి

**మహబూబాబాద్,**

జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. పుష్‌పుల్ రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌస్‌మియా మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

## అంత్యక్రియలకు వచ్చి.. చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత

**సంగారెడ్డి,**

జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన గణేళిష్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణేళిష్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణేళిష్‌ను గమనించిన మునిరాజు.. కాపాడేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణేళిష్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పు తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

**హైదరాబాద్,**

హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మానికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

## సిఎన్‌జికి ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్

### దేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం

### ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు

**న్యూఢిల్లీ,**

దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్‌ను మిళితం చేసి వినియోగదారులకు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రివర్గం రూ.23,731 కోట్ల వ్యయంతో గోబర్ధన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, దిగుమతి చేసుకునే సహజ వాయువుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. గోబర్ధన్ అంటే సేంద్రియ గ్యాస్. ఈ పథకాన్ని 2027 నుంచి 2036 ఆర్థిక సంవత్సరాల మధ్య అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచడం, ఆ గ్యాస్‌ను సీఎన్‌జీ నెట్‌వర్క్‌లో వినియోగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కంప్రెస్డ్ బయోగ్యాస్ ను పశువుల పేడ, పంట అవశేషాలు, పురపాలక వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, చెరకు కర్మాగారాల వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. శుద్ధి పక్రియ అనంతరం ఈ గ్యాస్ రసాయనికంగా సహజ వాయువుకు చాలా దగ్గరగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే ఉన్న సీఎన్‌జీ, పీఎన్‌జీ పంపిణీ వ్యవస్థల ద్వారానే దీన్ని సరఫరా చేయవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిఎన్‌జి కార్ల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయో-గ్యాస్ రసాయనిక లక్షణాలు సహజ వాయువుకు సమానంగా ఉండటంతో వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ అవసరం ఉండదు. పెట్రోల్‌లో ఇ20 వినియోగానికి ప్రత్యేక ఇంజిన్ అవసరమైనట్లు గా, బయో-అఔఉ విషయంలో అలాంటి నిబంధనలు ఉండవు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం నగర గ్యాస్ పంపిణీ సంస్థలకు బయోగ్యాస్ మిశ్రమం తప్పనిసరి కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం బయోగ్యాస్ మిశ్రమంతో ప్రారంభించి, 2027-28లో 4 శాతానికి, 2028-29 నుంచి 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుతో దేశీయంగా బయో-గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే దశాబ్దంలో బయోగ్యాస్ ఉత్పత్తి దాదాపు 10 రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో విదేశాల నుంచి సహజ వాయువు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, దేశ విదేశీ మారక వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ÷ళింద్రీయ వ్యర్థాలను వినియోగించి ఇంధనం ఉత్పత్తి చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు పంట అవశేషాలు, పశువుల పేడ వంటి వనరుల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశాలు కూడా ఈ పథకం ద్వారా ఏర్పడనున్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచే దిశగా గోబర్ధన్ పథకం కీలక అడుగుగా భావిస్తున్నారు.

PRGI NO: TGTEL/25/A5314

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## 'లుంగీవాలా' అవమానం

రాజ్యసభలో ఒక ఎంపిని అతని సాంప్రదాయ వేషం మీద ఆధారపడి 'లుంగీవాలా' అనడం అనేది కేవలం వ్యక్తిగత అవమానం కాదు. అది భారత రాజ్యాంగం చెప్పే 'ఏకత్వంలో వైవిధ్యం' ను తిరస్కరించడం. ప్రతి భాష, ప్రతి వేషం, ప్రతి యాసా భారతీయ సంస్కృతికి సమానమైన భాగం. ఒకటి 'జాతీయం', మరొకటి 'ప్రాంతీయం' అని చెప్పడం అన్యాయం. ఈ 'లుంగీవాలా' ఘటన మళ్లీ ఒక ప్రశ్న వేస్తోంది. భారతదేశం ఒక భాష, ఒక వేషం, ఒక యాసతో నడవదు. అది వేల భాష లు, వేల సంస్కృతుల సమ్మేళనం. ఆ సమ్మేళనాన్ని గౌరవించ కపోతే, ఏకత్వం కేవలం కాగితాల మీదే మిగులుతుంది. ఆగస్టు 12, 2026లో రాజ్యసభలో జరిగిన ఘటన కేవలం ఒక మాట కాదు. అది దశాబ్దాలుగా దక్షిణ భారతీయుల మీద కురిపించబడుతున్న అవమానాల సమూహంలో మరో కొత్త అధ్యాయం. కేరళకు చెందిన సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్‌ను బిజెపి ఎంపి సుస్మితా దేవ్ 'లుంగీవాలా' అని అవమానకర రీతిలో హేళనచేసేలా వ్యాఖ్యానించడం దక్షిణాది వేష, భాషా, సంస్కృతులపై దాడి చేసినట్లుగానే భావించవచ్చు. ఎంపి జాన్ బ్రిటాస్ తన సాంప్రదాయ ముండు ధరించి రాజ్యసభలో మాట్లాడుతుండగా ఆ మాట వచ్చింది. బ్రిట్టాస్ స్పష్టంగా చెప్పారు.. నేను గర్వంగా భారతీయుడిని, దక్షిణ భారతీయుడిని, మలయాళిని. మా భాష, సంస్కృతి, వంటకాలు, వేషభాషలు అన్నీ నాకు ప్రియమైనవి. ఇలాంటి అవమానకర చిత్రణలు అంగీకారయోగ్యం కావు. ప్రతిపక్ష ఎంపిలు దోతి ధరించి సంఘీభావం చూపారు. జెపి నడ్డా మేము దాన్ని లుంగీ అనం, దోతి అంటాం అని చెప్పారు. సుస్మితా దేవ్ తాను ఏ రాష్ట్ర వేషాన్నీ అవమానించలేదని చెప్పినా, ఈ మాటల వెనుక ఉన్న అహంకారం దాగలేదు. లుంగీ లేదా ముండు దక్షిణ భారతంలో సాధారణ, గౌరవప్రదమైన సాంప్రదాయ వస్త్రం. జంతర్ మంతర్ నుంచి జార్ఖండ్! కానీ ఉత్తర భారతంలోని కొన్ని వర్గాలకు ఇది 'తక్కువ' స్థాయి, 'మద్రాసీ' అనే అవమానకర వర్ణనతో ముడిపడి ఉంది. 1960లలో ముంబైలో శివసేన 'బజావో పుంగి, హటావో లుంగీ' నినాదంతో దక్షిణ భారతీయులను లక్ష్యం చేసింది. లుంగీ ధరించిన వారిని బయటపెట్టాలనే ఆ నినాదం ఉద్యోగ పోటీతో కలిసి దక్షిణాదివారిని 'అన్యులు'గా, 'అనవసరమైనవారు'గా చిత్రీకరించింది. 'మద్రాసీ' అనే పదం ఇప్పటికీ ఉత్తర భారతంలో దక్షిణాదివారిని సంబోధించేందుకు వాడుతారు. తమిళులు, తెలుగువారు, కన్నడిగులు, మలయాళీలు అందరినీ ఒకే బుట్టలోవేసి, వారి భాషలను 'యాండుగుండు'లా, వారి యాసను హాస్యాస్పదంగా చూపే ఈ అవమానకర చిత్రణ ఇంకా బ్రతికే ఉంది. బాలీవుడ్‌లోనూ ఇదే కనిపిస్తుంది.. లుంగీ, ఇడ్లీ–, దోసె, 'అయ్యో' అనే మాటలతో దక్షిణాదివారిని కామిక్, తక్కువ స్థాయి పాత్రలుగా చూపడం సాధారణం. ఇంకా లోతుగా చూస్తే, ఈ అసమానతలు భాషా వివాదాల్లోనూ, చర్మవర్ణం మీదనూ కనిపిస్తాయి. 2017లో బిజెపి నాయకుడు తరుణ్ విజయ్ అల్ జజీరా ఇంటర్వ్యూలో మేము జాతివాదులైతే దక్షిణ భారతంతో ఎందుకు జీవిస్తాం? మా చుట్టూ నల్లవారు ఉన్నారు అని అన్నారు. దక్షిణ భారతీయులను 'నల్లవారు'గా చిత్రీకరించి, 'మేము' వారితో జీవిస్తున్నామనే ఆ మాట దేశవ్యాప్తంగా ఆగ్రహం రేపింది. ఆయన తర్వాత క్షమాపణ చెప్పినా, ఆ మాటల్లోని అహంకారం, 'మేము', 'వారు' అనే విభజన స్పష్టమైంది. హిందీని దక్షిణ భారతం మీద బలవంతంగా రుద్దే ప్రయత్నాలు కొత్తవి కావు. 1937లో మద్రాస్ ప్రెసిడెన్సీలో సి. రాజగోపాలాచారి ప్రభుత్వం పాఠశాలల్లో హిందీని నిర్బంధం చేయడంతో తీవ్ర వ్యతిరేకత చెలరేగింది. పెరియార్ ఇ.వి. రామస్వామి నాయకత్వంలో హిందీ వ్యతిరేక ఉద్యమం బలపడింది. 1965లో హిందీని ఏకైక అధికార భాషగా చేయాలనే ప్రయత్నం తమిళనాడును మరోసారి అగ్నిలోకి నెట్టింది. విద్యార్థులు వీధుల్లోకి దిగారు, స్వయం దహనాలు జరిగాయి, రక్తపాతం చోటుచేసుకుంది. ఆ ఉద్యమం ఫలితంగానే ఆంగ్లం కొనసాగింపు పొందింది.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్

క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు

ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం

క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం

స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు

ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం

మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా

తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

హైదరాబాద్,


రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది.

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in

తెలుగు దినపత్రిక

# ఆట





## కుల్‌దీప్ కు తుది జట్టులో స్థిరత్వం కల్పించాలి

### టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ సూచన

భారత స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా ఉపయోగించుకోవట్లేదనే ఆందోళన మాజీ క్రికెటర్లలో తీవ్రమవుతోంది. 15 మందిలో ఉంటున్నప్పటికీ అతడికి తుది జట్టులో మాత్రం ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లోనూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు కుల్‌దీప్‌ను ఉద్దేశించి.. టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ, ద్రవిడ్ హయాంలో కుల్‌దీప్‌ను ఒక అసలైన మ్యాచ్ విన్నర్‌గా చూస్తూ పూర్తి స్వేచ్ఛ, భరోసా ఇచ్చారని గుర్తు చేశాడు. ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అదే బాటలో ఈ స్పిన్నర్ విషయంలో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలని హితవు పలికాడు. కాగా రాహుల్ ద్రవిడ్ కోచింగ్ హయాంలో (2021 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు) కుల్‌దీప్ అన్ని ఫార్మాట్లలో కలిపి నెలకు సగటున 2 మ్యాచ్‌ల చొప్పున 60 మ్యాచ్‌లు ఆడాడు. అయితే గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సగటు నెలకు 1.5 మ్యాచ్‌లకు (38 మ్యాచ్‌లు) పడిపోయింది. ముఖ్యంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్‌ను కాదని నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కుల్‌దీప్ పట్ల ప్రస్తుత మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానెల్‌లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గంభీర్ హయాంలో బౌలింగ్ పదును కంటే బ్యాటింగ్ డెప్త్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంపై మురళీ కార్తీక్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. టెస్టు మ్యాచ్ గెలవాలంటే ప్రత్యర్థి 20 వికెట్లు తీయడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కేవలం బ్యాటింగ్ డెప్త్ కోసం బౌలింగ్‌ను బలహీనపర్చకూడదని పేర్కొన్నాడు. కుల్‌దీప్ బ్యాట్‌తో ఏమీ అసమర్థుడు కాదని, నైట్‌వాచ్‌మన్‌గా ఎన్నోసార్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశాడు. జడేజా, అశ్విన్ వలె భారీ హిట్టింగ్ చేయలేకపోయినా, ఒక ప్రామాణిక స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో ఎక్కడైనా వికెట్లు తీయగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని కొనియాడాడు. తుది జట్టులో తన స్థానం ఖాయమనే భరోసా కల్పించినపుడే ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఈ సందర్భంగా మురళీ కార్తిక్ చెప్పుకొచ్చాడు.



## భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల

భారత్, అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్గానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది.అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.

# సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే

## ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలి.. నాణ్యతలో రాజీ పడొద్దు: మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:**

'గోదావరి పుష్కరాలు--2027' నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు--2027' కేబినెట్ ఉపసంఘం సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కేబినెట్ ఉపసంఘం చైర్మన్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేక నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల విషయంలో నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని, పురోగతిని పర్యవేక్షించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. పనుల పురోగతిని రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పనిచేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించగలమన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపించకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులను అనుసంధానించాలని, ఎక్కడైనా రహదారి అనుసంధానం లేకపోతే వెంటనే గుర్తించి స్థానిక నిధులతో పనులు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని సూచించారు. కేబినెట్ ఉపసంఘం సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని వాటికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

## చేయూత పింఛన్లపై సమీక్ష.. పంచాయతీలకు కీలక సూచనలు.

### జైపూర్ మండల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమీక్ష సమావేశం.



**అర్జున్ సమాచారం.జులై 14. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.**

జైపూర్: పంచాయతీల పరిధిలో సంక్షేమ కార్యక్రమాల అమలు, పరిపాలనా అంశాలపై గౌరవనీయులైన కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దృశ్య సమావేశంలో జైపూర్ మండలానికి చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ల అమలు, కేంద్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పంచాయతీ పరిపాలనకు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఆయా అంశాలపై అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. చేయూత పింఛన్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర ఆర్థిక సంఘం ద్వారా మంజూరయ్యే నిధులను నిబంధనల మేరకు సద్వినియోగం చేస్తూ గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీల పరిపాలనకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా చర్చించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో వెల్లడించిన సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## దేవునిగూడెం పాఠశాల విద్యార్థులకు పాదరక్షల పంపిణీ

### విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం.. పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం




**జన్నారం ప్రతినిధి । ఆగస్టు 14:**

జన్నారం మండలంలోని దేవునిగూడెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పాదరక్షల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాదరక్షలను అందజేసి, వారి సౌకర్యానికి తోడ్పాటు అందించారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చే సమయంలో పాదరక్షలు ధరించడం ద్వారా కాళ్లకు గాయాలు కాకుండా, దుమ్ము, మురికి కారణంగా వచ్చే ఇబ్బందులను నివారించవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులు పాఠశాలలో క్రమం తప్పకుండా హాజరై, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎండపెల్లి గంగన్న మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి గ్రామ ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ సహకరిస్తారని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్య ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందితే వారు మరింత ఉత్సాహంగా పాఠశాలకు హాజరవుతారని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అందజేసిన పాదరక్షలను విద్యార్థులు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగన్న, సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పాదరక్షలు అందజేయడం పట్ల పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

## సోమనపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

చెన్నూర్ , ఆగస్టు 14 (అర్జున్ సమాచారం): సోమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం అదనపు కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో నిర్మిస్తున్న గ్రేట్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్‌లో పలు అభివృద్ధి పనులకు అదనపు కలెక్టర్ భూమిపూజ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ సర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## అపన్న హస్తం కోసం ఎదురుచూపులు



**జన్నారం ప్రతినిధి, ఆగస్టు 14:**

జన్నారం మండలం మురిమడుగు గ్రామంలోని సత్యసాయి కాలనీకి చెందిన మంతిని రాజు, స్థానికంగా డ్రైవర్ రాజుగా గుర్తింపు పొందారు. ట్రాక్టర్ నడుపుతూ పొలాల్లో దుక్కులు దున్నడం, ఇతర వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చురుకుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రాజు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజుకు కాలేయ సంబంధిత వ్యాధి సోకడంతో చికిత్స కోసం తన వద్ద ఉన్న ట్రాక్టర్‌ను సైతం విక్రయించాల్సి వచ్చింది. చికిత్స అనంతరం ఆరోగ్యం కొంత మెరుగుపడటంతో కుటుంబ పోషణ కోసం తిరిగి డ్రైవింగ్ పనిని ప్రారంభించారు. అయితే పొలాల్లో ట్రాక్టర్ నడుపుతూ పనిచేయడం వల్ల మళ్లీ కాలేయ సంబంధిత సమస్యలు తలెత్తినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, అక్కడికి వెళ్లేందుకు కావాల్సిన ప్రయాణ ఖర్చులు సైతం సమకూర్చుకోలేని దుస్థితిలో రాజు కుటుంబం ఉంది. ఈ విషయం తెలుసుకున్న సత్యసాయి కాలనీ యువత, కాలనీ వాసులు మానవతా దృక్పథంతో స్పందించి తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. అందరూ కలిసి రూ.11,500 ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. అయితే రాజుకు మెరుగైన వైద్యం అందించేందుకు మరింత ఆర్థిక సహాయం అవసరమని కుటుంబ సభ్యులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి తమకు తోచినంత సాయం అందించి రాజు ప్రాణాలను కాపాడాలని కుటుంబ సభ్యులు చేతులు జోడించి వేడుకుంటున్నారు. సహాయం చేయదలచిన వారు: మంతిని గణేష్ ఫోన్‌పే: 7993534642 ఆపదలో ఉన్న కుటుంబానికి ఆపన్న హస్తం అందించడం మానవత్వానికి నిదర్శనం.

## సౌదీ కోర్టులో కేసు దాఖలు ప్రక్రియకు రూ.40 వేల ఆర్థిక సాయం

**జగిత్యాల ప్రతినిధి :: అర్జున్ సమాచారం ఆగస్టు 14::**

పరిహారం కేసు వేయడానికి ఎన్నారై వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ మద్దతు సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి పరిహారం అందేలా కోర్టులో కేసు దాఖలు చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాల అటెస్టేషన్, కోర్టు ఖర్చుల కోసం ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఒకరు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు.జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం, అనంతారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుర్రం మహేష్ ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లాడు. సౌదీకి చేరుకున్న 45 రోజులకే, 2023 జూలై 6న అల్ హసా, హెఫూఫ్ ప్రాంతంలో సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో మృతి చెందాడు.మహేష్ మృతి తర్వాత ఆయన కుటుంబానికి రావాల్సిన పరిహారం కోసం న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన సహాయం కోరుతూ ఆయన భార్య పూజారాణి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణికి వచ్చారు.ఆమె పరిస్థితిని తెలుసుకున్న ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ స్పందించి, పరిహారం కేసు దాఖలు చేయడానికి అవసరమైన ఖర్చుల కోసం రూ.40 వేల చెక్కును పూజారాణికి అందజేశారు.ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్ కర్రి పద్మారాణి, జీఏడి అధికారి ఇ. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజల పక్షాన కలం.. సమస్యల పరిష్కారమే ధ్యేయం

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న అర్జున్ సమాచారం ఎడిటర్ :లింగం రాజయ్య:

**అర్జున్ సమాచారం.జులై 14.**
**(స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.**

మంచిర్యాల: ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, బాధితుల గొంతుకగా నిలవడం, అవసరమైన సందర్భాల్లో ప్రజలకు అండగా నిలవడమే తన బాధ్యతగా భావిస్తూ. అర్జున్ సమాచారం ఎడిటర్ :లింగం రాజయ్య ముందుకు సాగుతున్నారు. పదవులు, ఆర్థిక స్థితిగతులు శాశ్వతం కావని, ప్రజల కోసం చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన అన్నారు. సమాజంలో సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో విలేఖరుల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, పారిశుద్ధ్యం, పేదల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రజల తరఫున ప్రశ్నించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఒక సమస్యను వార్తగా ప్రచురించడం మాత్రమే కాకుండా, ఆ సమస్యకు పరిష్కారం లభించే వరకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం అవసరమన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేయడమే నిజమైన పాత్రికేయ సేవగా భావిస్తున్నట్లు చెప్పారు. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు సాధ్యమైన సహాయం అందించడం, పేద విద్యార్థులకు అవసరమైన తోడ్పాటు అందించడం, గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహించడం వంటి సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం కావడం ద్వారా సమాజానికి తన వంతు సేవ చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కార మార్గం చూపించేందుకు కృషి చేయడం వల్ల ఎంతో సంతృప్తి లభిస్తుందని అన్నారు. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి స్పందించే మనస్తత్వం ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. విలేఖరి చేతిలోని కలం కేవలం వార్తలు రాయడానికి మాత్రమే కాకుండా సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించేందుకు, బలహీన వర్గాల గొంతుకగా నిలిచేందుకు ఉపయోగపడాలని అర్జున్ సమాచారం ఎడిటర్ :లింగం రాజయ్య పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని అన్నారు. “పదవి ఉన్నప్పుడు పలకరించే వారు ఎందరో ఉంటారు.. ఆర్థికంగా ఎదిగినప్పుడు వెంట నడిచేవారు మరెందరో ఉంటారు. కానీ కష్టకాలంలో ప్రజల వెంట నిలిచి, వారి సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, పరిష్కారం కోసం పోరాడే వారే నిజమైన సేవకులు. ప్రజల కోసం పనిచేయడమే నా లక్ష్యం” అని అర్జున్ సమాచారం ఎడిటర్ :లింగం రాజయ్య అన్నారు.



# పొలం దగ్గర విద్యుత్ షాక్‌తో తండ్రి, కొడుకు మృతి

## మోటార్ డెలివరీ పైపు తిప్పుతుండగా విషాద ఘటన

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:**

కాటారం మండలం గంగారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కట్టెకోల బాపు (45), ఆయన కుమారుడు మనోజ్ (23) గురువారం పొలానికి వెళ్లారు. వ్యవసాయ విద్యుత్ మోటార్‌కు సంబంధించిన డెలివరీ పైపును తిప్పుతున్న సమయంలో మనోజ్‌కు విద్యుత్ షాక్ తగిలింది. కుమారుడిని పట్టుకునేందుకు ప్రయత్నించిన బాపుకు కూడా విద్యుత్ షాక్ తగలడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో గంగారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అర్హులైన పెన్షన్‌దారులను గుర్తించాలి.. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్

**కమాన్‌పూర్, ఆగస్టు 14:**

అర్హులైన పెన్షన్‌దారులను గుర్తించి వారికి చేయూత పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ సూచించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు చేయూత పెన్షన్ విధివిధానాలను వివరించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, కుటుంబ సహాయం లేని వారు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు పెన్షన్‌కు అర్హులని తెలిపారు. అలాగే ఎయిడ్స్ బాధితులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ చేయించుకుంటున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు ఉన్నవారు అర్హులని, తెల్ల రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలని, బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని సూచించారు. గ్రామపంచాయతీ, మీ సేవ కేంద్రాలతో పాటు ప్రజాపాలన వేదిక ద్వారా కూడా దరఖాస్తు



చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్, ఫొటోలను సమర్పించాలని సూచించారు. అనంతరం 16వ ఆర్థిక సంఘం నిధులపై సమీక్ష నిర్వహించారు. నిధుల వినియోగం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సౌమ్య, సర్పంచులు రంగు సత్యనారాయణ గౌడ్, జంగిలి పోచాలు, గుమ్మడి శ్రీనివాస్, శీలారపు మల్లయ్య, కార్యదర్శులు బచ్చల ప్రసాద్, అమీనా భాను, జంజర్ల అమల, రాము, సూది రెడ్డి ప్రవళిక, అల్లి రామ్మోహన్, గుమ్మడి సదయ్య, సాయి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# డ్రై డే సందర్భంగా ఇంటింటా అవగాహన కార్యక్రమం

## నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:**

రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో డ్రై డే సందర్భంగా శుక్రవారం వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొండవెన దివ్యసుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఆశా కార్యకర్త తులసి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మాదిగల ఐక్యతే బలం.. రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలి

## మాదిగ మహాశక్తి కోర్ కమిటీ సభ్యులు ఆసంపల్లి శ్రీనివాస్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:**

మాదిగల ఐక్యతే బలమని, రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని మాదిగ మహాశక్తి కోర్ కమిటీ సభ్యులు ఆసంపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మంథని పట్టణంలోని బీఎస్ బ్యాంకెట్ హాల్‌లో మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆసంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మాదిగలు అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నారని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని అన్నారు. 'మన ఓటు మనదే' అనే నినాదంతో మాదిగలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. మాదిగలకు రాజకీయ అవకాశాలు కల్పించని పార్టీలను ఓడించే దిశగా సమాజం కదలాలని పిలుపునిచ్చారు.



మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ తమ సంఖ్యాబలాన్ని సమాజ అభ్యున్నతి కోసం వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు మాదిగల ఓటు రాజకీయ ప్రాతినిధ్యానికి ఉపయోగపడేలా సమాజాన్ని చైతన్యపరచడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. మాదిగల అభ్యున్నతికి తనవంతు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంథనిలో త్వరలో మాదిగల 'అలై బలై' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యత, బలాన్ని చాటాలని కోరారు. కార్యక్రమంలో వేల్పుల గట్టయ్య, కన్నూరి రాజబాపు, మంథని లక్ష్మణ్, కన్నూరి బాపు, వేల్పుల పోషం, బూడిద తిరుపతి, కాసిపేట సాంబయ్య, దేవల్ల విజయ్, కొయ్యల రాజమల్లు, కరుణ కృష్ణ, మంథని లింగయ్య, శ్రీకాంత్, రమేష్, బానేష్, శేఖర్, ప్రభాకర్, రామన్న, రాజేశ్వర్, సంపత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ లైన్మెన్‌గా కలవేన ఓదేలు

## ఆగస్టు 15న మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు

**కమాన్‌పూర్, ఆగస్టు 14:**



కమాన్‌పూర్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ విభాగంలో లైన్మెన్‌గా పనిచేస్తున్న కలవేన ఓదేలు ఉత్తమ లైన్మెన్‌గా ఎంపికయ్యారు. కమాన్‌పూర్ గ్రామంలో తక్కువ వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు, ఎన్నో ఏళ్లుగా రహదారులకు ఇరువైపులా ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తక్కువ వోల్టేజీ సమస్య లేకుండా నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదకర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను సరిచేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. విధుల్లో చురుకుదనం, సేవాభావాన్ని గుర్తించిన ఎన్‌పీడీసీఎల్ పెద్దపల్లి జిల్లా ఎస్‌ఈ గంగాధర్, మంథని డీఈ ప్రభాకర్, ఏడీఈ వెంకటనారాయణ, ఏఈ తూర్పాటి స్వామి సూచనల మేరకు ఓదేలును ఉత్తమ లైన్మెన్‌గా ఎంపిక చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఓదేలు అవార్డు అందుకోనున్నారు.

# సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

## పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:**

పోలీసు శాఖలో అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఏఆర్ ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన టీ. మోహన్, ఎస్. సత్తయ్యలు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. పదోన్నతి అనేది మరింత బాధ్యతతో కూడిన అవకాశమని పేర్కొన్నారు. విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉన్నతాధికారుల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా విధులు నిర్వహించాలని తెలిపారు. పదోన్నతి పొందిన అధికారులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, రమేష్, ఆర్ఐలు దామోదర్, రమేష్, ఆర్ఎస్ఐ పోచలింగం, సీసీ హరీష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బియ్యం అక్రమ తరలింపుపై రైస్‌మిల్లర్‌పై పీడీ యాక్ట్

## రూ.15.70 కోట్ల విలువైన ప్రభుత్వ బియ్యం దారి మళ్లించినట్లు ఆరోపణలు

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:**

ప్రభుత్వానికి అందించాల్సిన కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని అక్రమంగా దారి మళ్లించి, బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించి ఆర్థిక లాభాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్‌మిల్లర్ గంప సంతోష్‌కుమార్‌పై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. బ్లాక్‌మార్కెటింగ్ నిరోధక, నిత్యావసర వస్తువుల సరఫరా పరిరక్షణ చట్టం--1980లోని సెక్షన్ 3(1), 3(2) కింద ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ లక్షెట్టిపేట సబ్‌జైలులో ఉన్న నిందితుడికి జైలు అధికారుల సమక్షంలో ఉత్తర్వులు అందజేసి అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. గంప సంతోష్‌కుమార్ దండేపల్లి మండలం లింగాపూర్‌లోని ఎం/ఎస్ రామలక్ష్మణ్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్ మేనేజింగ్ పార్ట్‌నర్‌గా ఉన్నారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న కస్టమ్ మిల్లింగ్ ఒప్పందాల ప్రకారం రబీ 2022--23, రబీ 2024--25 సీజన్లలో మొత్తం 9,244.206 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ కోసం పొందారు. ఈ ధాన్యానికి సంబంధించి ప్రభుత్వానికి 6,286.059 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,833.511 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించినట్లు అధికారులు గుర్తించారు. ఇంకా




4,452.548 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందించాల్సి ఉండగా, దానికి సమానమైన సుమారు 6,170.643 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దారి మళ్లించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి రూ.15.14 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు. గత సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బకాయిలను కలుపుకుని మొత్తం నష్టం రూ.15,70,36,726గా నిర్ధారించినట్లు తెలిపారు. గంప సంతోష్‌కుమార్‌పై ప్రభుత్వ ధాన్యం దారి మళ్లింపునకు సంబంధించి 2025, 2026 సంవత్సరాల్లో మరో రెండు కేసులు దండేపల్లి, హాజీపూర్ పోలీస్‌స్టేషన్లలో నమోదైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారి మళ్లించడం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. సీఎంఆర్ సరఫరాలో కొరత ఏర్పడితే పేదలు, అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ బియ్యం అందించే వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. గతంలోనూ నిందితుడిపై కేసులు నమోదైనప్పటికీ అక్రమ కార్యకలాపాలు కొనసాగించారని, సాధారణ చట్టపరమైన చర్యలు నిరోధక ప్రభావం చూపలేదని తెలిపారు. ప్రస్తుతం దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడు రిమాండ్‌లో ఉన్నారని, బెయిల్‌పై విడుదలైతే మళ్లీ ఇదే తరహా అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు నివేదించిన నేపథ్యంలో పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ వెల్లడించారు. ప్రభుత్వానికి చెందిన నిత్యావసర వస్తువులను అక్రమంగా దారి మళ్లించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# ఆలయానికి నిత్యావసర సరుకులు అందజేత

## కుమారుడి తొలి వేతనం సందర్భంగా అన్నదానానికి విరాళం



**కమాన్‌పూర్, ఆగస్టు 14:**

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ ఆదివరాహస్వామి ఆలయంలో అన్నదానం కోసం జూలపల్లి గ్రామానికి చెందిన గుండా శ్రీనివాస్ నిత్యావసర సరుకులను అందజేశారు. తన కుమారుడికి ఉద్యోగం రావడంతో తొలి వేతనం అందుకున్న సందర్భంగా ఆదివరాహస్వామి దేవస్థానానికి బియ్యం, పప్పు దినుసులతో పాటు నిత్యావసర సరుకులను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గుండా శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈఓ కాంతారెడ్డి, డైరెక్టర్లు తీగల రాజయ్య గౌడ్, చాట్ల రాయమల్లు, కొంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవు .. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:**



అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్‌కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ అధికారులను అనవసరంగా అప్రతిష్ఠపాలు చేసే విధంగా లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాఘవపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సరైన అనుమతులు లేవంటూ 2023 జనవరి 2న లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, అవసరమైన వివరాలతో కూడిన నివేదికను లోకాయుక్తకు సమర్పించినట్లు తెలిపారు. అధికారులు సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం బొబ్బిలి సత్యనారాయణ దాఖలు చేసిన ఫిర్యాదు నిరాధారమైనదని, వేధింపులకు ఉద్దేశించినదిగా పేర్కొంటూ 2025 డిసెంబర్ 22న లోకాయుక్త ఫిర్యాదును కొట్టివేసిందని కలెక్టర్ తెలిపారు. తప్పుడు, నిరాధార ఫిర్యాదు ద్వారా లోకాయుక్త సంస్థతో పాటు ప్రభుత్వ అధికారుల విలువైన సమయాన్ని వృథా చేసినందుకు తెలంగాణ లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 13-ఏ కింద రూ.10 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. లోకాయుక్త ఆదేశాల మేరకు రూ.10 వేల జరిమానాను రెవెన్యూ రికవరీ చట్టం కింద బొబ్బిలి సత్యనారాయణ నుంచి వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిరాధార ఆరోపణలు వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ఎవరినీ ఉపేక్షించబోమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# సౌదీ కోర్టులో కేసు దాఖలు ప్రక్రియకురూ.40 వేల ఆర్థిక సాయం

జగిత్యాల ప్రతినిధి ::అర్జున్ సమాచారం ఆగస్టు 14::

? పరిహారం కేసు వేయడానికి ఎన్నారై వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ మద్దతు సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి పరిహారం అందేలా కోర్టులో కేసు దాఖలు చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాల అటెస్టేషన్, కోర్టు ఖర్చుల కోసం ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఒకరు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు.జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం, అనంతారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుర్రం మహేష్ ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లాడు. సౌదీకి చేరుకున్న 45 రోజులకే, 2023 జూలై 6న అల్ హసా, హెుఫూఫ్ ప్రాంతంలో సైకిల్‌పై వెళ్తుండగా కారు ఢీకొనడంతో మృతి చెందాడు.మహేష్ మృతి తర్వాత ఆయన కుటుంబానికి రావాల్సిన పరిహారం కోసం న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన సహాయం కోరుతూ ఆయన భార్య పూజారాణి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణికి వచ్చారు.ఆమె పరిస్థితిని తెలుసుకున్న ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ స్పందించి, పరిహారం కేసు దాఖలు చేయడానికి అవసరమైన ఖర్చుల కోసం రూ.40 వేల చెక్కును పూజారాణికి అందజేశారు.ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్ కర్రి పద్మారాణి, జీఏడి అధికారి ఇ. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

PRGI NO: TGTEL/25/A5514
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
సినిమా
CINEMA




# దుల్కర్ సల్మాన్ 'ఐమ్ గేమ్' వాయిదా..

## థ్రిల్లర్ కోసం మరో రెండు వారాలు వెయిటింగ్

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఐమ్ గేమ్'పై గత కొంతకాలంగా మంచి బజ్ నెలకొంది. 'హృదయం' ఫేమ్ నహాస్ హిదయత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా గ్యాంబ్లింగ్ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇప్పటికే టీజర్, పాటలు విడుదలై సినిమాపై ఆసక్తిని పెంచాయి. మేకర్స్ తొలుత ఈ చిత్రాన్ని ఆగస్టు 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్స్ లేకపోవడంతో 'ఐమ్ గేమ్' వాయిదా పడే అవకాశం ఉందంటూ ఇటీవల ప్రచారం మొదలైంది. తాజాగా ఆ ప్రచారమే నిజమైంది. దుల్కర్ సల్మాన్ స్వయంగా సినిమా విడుదలపై అధికారిక ప్రకటన చేశారు. ఆగస్టు 20న విడుదల కావాల్సిన 'ఐమ్ గేమ్' వాయిదా పడిందని చిత్రబృందం ప్రెస్ నోట్ ద్వారా వెల్లడించింది. ఈ మార్పు కారణంగా అభిమానులకు, ప్రేక్షకులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కూడా తెలిపారు. అయితే అభిమానులు ఎక్కువ కాలం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. సినిమాకు కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. సెప్టెంబర్ 3 నుంచి 'ఐమ్ గేమ్' థియేటర్లలో సందడి చేయనుంది. సినిమా విడుదల తేదీని మార్చడానికి ప్రధాన కారణం అన్ని భాషల్లో ఒకేసారి చిత్రాన్ని విడుదల చేయాలనే నిర్ణయమేనని దుల్కర్ సల్మాన్ తెలిపారు. ప్రేక్షకులకు అన్ని భాషల్లో ఒకే సమయంలో సినిమాను అందించాలనే ఉద్దేశంతో రిలీజ్ డేట్‌ను మార్చినట్లు వెల్లడించారు.



# మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను

'ఇందులో నా పాత్ర పేరు మహాదేవి. దేవుని అనుగ్రహంతో పుట్టే పాత్ర అది. నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను. బుద్ధిజం పుస్తకాల్ని చదివాను' అన్నారు నటి కామాక్షి భాస్కర్ల. ఆమె ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'అగధ'. శ్రవణ్‌రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్ కీలక పాత్రధారులు. ఎమ్మెస్ రాజు దర్శకుడు. ఈ నెల 14న విడుదల కానున్నది. గురువారం హైదరాబాద్‌లో కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. 'ఎమ్మెస్ రాజుగారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఓకే చెప్పాను. కానీ ఎమ్మెస్ రాజుగారు కూర్చోబెట్టి కథ చెప్పి, నాపాత్రను వివరించారు. నిజంగా కథ, నా పాత్ర మనస్ఫూర్తిగా నచ్చాయి.





# మస్తుగుందిర యవ్వారం

యంగ్ హీరో హవీష్ కథానాయకుడిగా, త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ'. సత్యనారాయణ కోనేరు సమర్పణలో, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయిక. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించగా, తాజాగా చిత్రంలోని 'మస్తుగుందిర యవ్వారం..' అంటూ తెలంగాణ స్లాంగ్‌లో సాగే పాటను వరంగల్ శాసన సభ్యులు నాయని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా హనుమకొండలోని కాళోజి కళా క్షేత్రం వేదికగా గురువారం ఘనంగా విడుదల చేశారు. కాశర్ల శ్యామ్ రాసిన ఈ పాటను మిక్కీ జే మేయర్ స్వరపరిచారు. అందమైన విజువల్స్‌తో పాటు హీరో హవీష్, హీరోయిన్ కావ్య థాపర్ కెమిస్ట్రీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హవీష్‌ను కొత్తగా చూపిస్తూ తనదైన శైలిలో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా త్రినాథరావు నక్కిన ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని, కామెడీ, రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలు కూడా ఈ చిత్రంలో ఉంటాయని చిత్రబృందం తెలిపింది.


# స్టైలిష్ డాక్టర్ ధర్మన్

సూపర్‌స్టార్ రజనీకాంత్ తాజా చిత్రం 'ధర్మన్' (ది డెడ్లీ డాక్టర్) శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో అగ్ర హీరో కమల్‌హాసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా రెండోషెడ్యూల్ మొదలైంది. ఈ సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రజనీకాంత్ మెడలో స్టెతస్కోప్‌తో స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, రజనీకాంత్ పాత్ర సరికొత్త పంథాలో సాగుతుందని మేకర్స్ తెలిపారు. అన్బరివ్ ద్వయం యాక్షన్ కొరియోగ్రఫీ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.

# కదిరి కాకాజీ ఖాయమేనా?

'మెగా లీక్స్' టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి. గతంలో కూడా పలు సినీ వేడుకలకు అతిథిగా హాజరైన చిరంజీవి.. తన సినిమాలకు చెందిన అప్‌డేట్లను అనుకోకుండా లీక్ చేసి చర్చలకు తెరలేపారు. ఇవి అభిమానులకు ఆనందాన్ని ఇచ్చినా.. ప్రమోషన్ల ప్లానింగ్‌లో మార్పులు రావడం వల్ల మేకర్లు మాత్రం కాస్త ఇబ్బందిపడాల్సిన పరిస్థితి. రీసెంట్‌గా 'కొరియన్ కనకరాజు' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్న మెగాస్టార్.. మరోసారి నోరు జారారు. తన 'మెగా 158' సినిమా టైటిల్‌ను 'కదిరి..' అంటూ సగం చెప్పేసి.. 'మిగతా పదాన్ని పూర్తి చేసుకోండి..' అన్నట్టుగా అటు అభిమానులకూ, ఇటు ప్రేక్షకులకు పరీక్ష పెట్టాడు. దాంతో కొందరు 'కదిరి కాకాజీ' అంటూ, మరికొందరు 'కదిరి నరసింహ' అంటూ ఎవరికి తోచిన టైటిల్‌ని వారు చెబుతున్నారు. అయితే.. ఫిల్మ్ వర్గాల్లో మాత్రం 'కదిరి కాకాజీ' టైటిల్ బలంగానే వినిపిస్తున్నది. అసలు టైటిల్ తెలియాలంటే ఈ నెల 22 వరకూ ఆగాల్సిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ని, టీజర్‌ని విడుదల చేయనున్నారు. కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట కె.నారాయణ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.





# కార్మికుల సమస్యలపై ఏకమై పోరాడాలి

## సింగరేణికి కొత్త గనులు కేటాయించాలి: కేంగర్ల మల్లన్న

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:





తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య బాయిబాట కార్యక్రమంలో భాగంగా ఆర్‌జీ-1 ఏరియాలోని 2 ఇంక్లైన్ గనిని తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య వ్యవస్థాపక కన్వీనర్, అధ్యక్షుడు కేంగర్ల మల్లన్న సందర్శించారు. ఆర్‌జీ-1 నాయకుడు దాసరి నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేంగర్ల మల్లన్న మాట్లాడుతూ.. గతంలో నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను కార్మికులందరూ ఐక్యంగా పనిచేసి లాభాల బాటలోకి తీసుకొచ్చారని అన్నారు. అయితే ప్రస్తుతం కార్మికులకు కనీస అవసరాలైన రక్షణ పరికరాల కిట్లు, పని ముట్లకు సంబంధించిన సామగ్రిని కొనుగోలు చేసేందుకు కూడా నిధులు లేవని సంస్థ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా కార్మికులందరూ ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సత్తుపల్లి ఓసీపీ-3, కోయగూడెం ఓసీపీ-3 గనులను సింగరేణికి కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య నాయకులు దొడ్డ సతీష్, జక్కుల శంకర్, రేగుల నరేష్, భాస్కర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



జగిత్యాల ప్రతినిధి :: అర్జున్ సమాచారం ఆగస్టు 14::

జగిత్యాల రూరల్ మండలం వంజరు పల్లి గ్రామంలో 20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గజంగి నందయ్య,సర్పంచ్ అదరవేని గంగమల్లయ్య, ఉపసర్పంచ్ బొల్లె తిరుపతి భీమవ్వ, చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి,ఎంపీడీవో రమాదేవి,వీ=ూ హకీం,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం,మాజీ పాక్స్ చైర్మెన్ సదాశివ రావు,మాజీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి,సర్పంచుల ఫోరం కట్ట రాజేందర్, మాజీ ఎంపీపీ మహేష్,,సర్పంచ్ లు ప్రకాశ్,వంశీ,మాజీ సర్పంచ్ మల్లారెడ్డి,కుడుకుల లక్ష్మణ్,అంకం సతీష్,నరేష్, గంగారం, ఉపాధ్యక్షులు డీలర్ రవి, నరేష్ ,మండల యూత్ అధ్యక్షులు భూమరెడ్డి,నాయకులు తిరుపతి, ఎఎంసి డైరెక్టర్ శ్రీకాంత్,మాజీ ఎంపీటీసీ శంకర్ ,అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులకు లైన్స్ క్లబ్ పోషకాహార కిట్ల పంపిణీ..



అర్జున్ సమాచారం.జులై 14. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.

మంచిర్యాల: క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు దాతలు ముందుకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ కోరారు.మంచిర్యాల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల మండలానికి చెందిన 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. భగత్‌సింగ్‌నగర్‌లోని లైన్స్ క్లబ్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పాల్గొని కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలనకు మందులతో పాటు పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి నమోదు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తోందన్నారు. పోషకాహారం కోసం ప్రతినెలా రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందిస్తున్న పోషకాహార కిట్లతో వ్యాధిగ్రస్తుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.మందులు క్రమం తప్పకుండా వాడటం, పోషకాహారం తీసుకోవడం, వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించాలని కోరారు. లైన్స్ క్లబ్ సభ్యులు అందించిన సహకారానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, ఆరోగ్య కార్యకర్తలు నాందేవ్, శ్రీనివాస్, అల్లాడి శ్రీనివాస్, క్షయ వ్యాధి సమన్వయకర్త సురేందర్, సాయి రెడ్డి, క్షయ వ్యాధి పర్యవేక్షణ సిబ్బంది, లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన కొమ్ముగుడం తాగునీటి ట్యాంక్ పరిశీలన

నూతన ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సర్పంచ్ వినతి

అర్జున్ సమాచారం.జులై 14. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.

జైపూర్: మిట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగుడం గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న తాగునీటి వాటర్ ట్యాంకును సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కొమ్ముగుడం గ్రామంలోని తాగునీటి ట్యాంకు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ కామెర మనోహర్, ఉపసర్పంచ్ కుమ్మరి రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిరణ్, ఏఈ రాజ్‌కుమార్, వార్డు సభ్యులు, దుర్గం లింగయ్య, స్థానిక కాలనీవాసులు ట్యాంకును పరిశీలించారు. ట్యాంకు పరిస్థితిని పరిశీలించిన అనంతరం ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను కోరారు.



కొమ్ముగుడం గ్రామ ప్రజలకు నిరంతరం సురక్షితమైన తాగునీరు అందించేందుకు నూతన ట్యాంకు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు చేయాలని సర్పంచ్ కామెర మనోహర్ అధికారులను కోరారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "ప్రజల తాగునీటి అవసరాలే మా ప్రథమ ప్రాధాన్యత.. గ్రామ అభివృద్ధే మా లక్ష్యం" అని సర్పంచ్ కామెర మనోహర్ పేర్కొన్నారు.

# తాండూర్ లో ఘనంగా తిరంగా యాత్ర



అర్జున్ సమాచారం.జులై 14. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.

తాండూర్.ఆగస్టు 14: ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో భాగంగా తాండూరు మండల కేంద్రంలో 500 మీటర్ల జాతీయ జెండాతో యాత్రను బీజేపీ నాయకులు, జాతీయవాదులు, విద్యార్థులు కలిసి ఘనంగా నిర్వహించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ అండర్ బ్రిడ్జి నుండి యాత్ర ప్రారంభమై, ఐబి ప్రధాన కూడలి అండర్ బ్రిడ్జి మీదుగా జాతీయ జెండాలు, దేశభక్తి నినాదాలతో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రతి భారతీయుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశ ఐక్యతను చాటి చెప్పాలని నాయకులు పిలుపునిచ్చారు. విద్యార్థుల భాగస్వామ్యం ఈ తిరంగా యాత్రలో స్థానిక విద్యా భారతి, సెయింట్ థెరిస్సా పాఠశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ, జిల్లా కార్యదర్శులు రామగౌని మహీధర్ గౌడ్, రాచర్ల సంతోష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు పులగం తిరుపతి, బొల్లెద్ల కేశవరెడ్డి, యంగర్ తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు పాగిడి చిరంజీవి, నర్సింగ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ తో పాటు మండల నాయకులు జాతీయవాదులు అభినవ సంతోష్ కుమార్, గాదె రాజేశం, చొక్కాల నాగభూషణ్, ఏముర్ల ప్రవీణ్, గుజ్జేటి శేఖర్, ప్రభాకర్, అద్వాల సతీష్, ఎలిగేటి నరేష్, ఆనంద్, కామెర మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో తాసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా.

అర్జున్ సమాచారం.జులై 14. (స్టాఫ్ రిపోర్టర్) మంచిర్యాల జిల్లా.

తాండూర్ :జూలై 14: హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో తాండూర్‌లో ర్యాలీ నిర్వహించి, తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తాసిల్దార్ జ్యోత్స్న కు వినతి పత్రం అందజేశారు. హమాలీల సంఘం సీఐటీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గుమాస ప్రకాష్, సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వెంటనే హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, పెన్షన్ నెలకు 6000 రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన హమాలీల కుటుంబాలకు 25 లక్షల రూపాయల నష్టపరిహారం, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి, ప్రభుత్వ పథకాలను హమాలీలకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హమాలీల సమస్యలు పరిష్కరించాలి. రైస్ మిల్లు, బజార్, గోడౌన్స్, ఐకేపీ గ్రామీణ హమాలీలు అందరూ హక్కుల సాధనకై ఐక్యంగా రాబోయే పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందూరి మల్లేష్, చింతపురి లక్ష్మణ్, ధర్మరాజుల వెంకటేష్, చదువుల రవీందర్, తోగారి శ్రీను, తాండూర్ మల్లేష్, మాసాడి సుధాకర్, కొండు రాములు, ఆయిల్ల శంకర్, పుట్ట రమణ, రుకుంబాపు, మాసాడి తిరుపతి, లెక్కల జగదీష్, ధరణి బుచ్చయ్య, ఒడ్నాల చందు, ఇందూరి బానేష్, కామెరా బాపు తదితర సీఐటీయూ నాయకులు హమాలీ కార్మికులు పాల్గొన్నారు



# మంథని ఆసుపత్రిలో విధుల్లో చేరిన జనరల్ సర్జన్

మంత్రి శ్రీధర్ బాబు చొరవతో మరో సర్జన్ నియామకం

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:



మంథని ఏరియా ఆసుపత్రిలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన నూతన నియామకాలలో భాగంగా జనరల్ సర్జన్ డాక్టర్ నికీల్ తేజ విధుల్లో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ఈ నియామకం జరిగినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టీవీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మంథని పట్టణంతో పాటు పరిసర మండలాల ప్రజలకు తరచుగా ఎదురయ్యే పలు శస్త్రచికిత్స సంబంధిత వ్యాధులకు మంథని ఏరియా ఆసుపత్రిలోనే ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అపెండిసైటిస్, పిత్తాశయంలో రాళ్లు, పిత్తాశయం వాపు, గజ్జల హెర్నియా, బొడ్డు హెర్నియా, పొట్ట గోడ హెర్నియా, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, మలద్వారం చుట్టూ చీము గడ్డలు, పైలోనైడల్ సైనస్, హైడ్రోసీల్, రొమ్ములో గడ్డలు, రొమ్ములో చీము గడ్డలు, కొవ్వు గడ్డలు, చర్మం కింద గడ్డలు, శరీరంలోని చీము గడ్డలు, మధుమేహంతో వచ్చే పాదాల పుండ్లు, పేగుల అడ్డంకి, పేగుకు రంధ్రం పడటం, ఉదర పొర వాపు వంటి సమస్యలకు శస్త్రచికిత్సలు, అవసరమైన చోట లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు సైతం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు లేదా వైద్య సేవలకు సంబంధించిన వివరాల కోసం ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను 9885808589 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

# హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కార్మిక చట్టాలను కాపాడేందుకు

ఉద్యమాలను ఉధృతం చేస్తాం: కడారి సునీల్

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, ఆగస్టు 14:

మంథని హమాలీ కార్యాలయంలో ఏఐటీయూసీ మంథని డివిజన్ కార్యకర్తల సాధారణ సమావేశం ఓదెలు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ హాజరై మాట్లాడారు. సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 20న ఏఐటీయూసీ నాలుగో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో కార్మిక చట్టాలు, హక్కులు, సంక్షేమ సౌకర్యాలు, హమాలీ కార్మికుల సమస్యలు, అసంఘటిత కార్మిక వర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కీలక తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేసేందుకు సుల్తానాబాద్ మహాసభ వేదిక కానుందని తెలిపారు. నాడు క్విట్ ఇండియా ఉద్యమం చేపట్టిన వారే నేడు కమ్




ఇండియా పేరుతో విదేశీ సంస్థలకు వంతపాడటం విచిత్రంగా ఉందని విమర్శించారు. స్వదేశీ జపం చేస్తూనే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. 79 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో అమలులో ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులు, ఉద్యోగులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమ సౌకర్యాలను కాపాడుకునేందుకు పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కె. అనిల్, ఎం. గట్టయ్య, ఏ. సదయ్య, ఎల్. రాయమల్లు, బి. శంకర్, సిద్ధం తిరుపతి, ఏసీ నరేష్, ఏసీ శ్రీనివాస్, బీఎస్సీ రమేష్, ఈ. నరసయ్య, మల్లేష్, శంకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthaminagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.